రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం


హెచ్‌ఎం రాంరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు అందుకున్న నర్కూడ పాఠశాల హెచ్‌ఎం రాంరెడ్డిని శుక్రవారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సన్మానించారు. ఎమ్మెల్యే నివాసంలో తోటి ఉపాధ్యాయులతో కలిసి రాంరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా, ఇంచార్జి ఎంఈఓగా రాంరెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయల సంఘాల నాయకులు బాల్‌రెడ్డి, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా తయారయ్యా. చండిక నగర్ కాళీ మందిర్ వెనుక ఉన్న కాలనీలో చాలా ఫంక్షన్ హాల్స్ ఉన్నాయి. ఎప్పుడు రద్దీగా ఉండే ప్రాంతంలో రెండు కరెంటు స్తంభాలు ఓ వైపునకు వంగి ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితిలో స్థానికులను ఆందోళన కల్గిస్తున్నాయి. పలుమార్లు కరెంటు ఏఈకి ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు ఆరోపించారు.

పార్టీ మారిన ఎమ్మెల్యే రాజీనామా చేసి గెలవాలి

బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి


తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: పార్టీ ఫిరాయింపులకు పాల్పడి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ సిగ్గుమాలిన పని చేస్తున్నారని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోకల శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల విషయంలో స్పీకర్ నిర్ణయం తీసుకోవాల్సిన తరుణంలో స్థానిక ఎమ్మెల్యే చిల్లర రాజకీయాలకు తెరలేపారన్నారు. స్పీకర్ ఎమ్మెల్యేకు నోటీసులు ఇవ్వడంతో ఎమ్మెల్యే సమాధానం విస్తుగొల్పేలా ఉందన్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్పీకర్‌కు ఇచ్చిన సమాధానంలో ఎమ్మెల్యే ఇప్పటికీ బీఆర్‌ఎస్ పార్టీలో కొనసాగుతున్నట్లుగా చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిజంగానే ప్రజలకు మంచి చేసి ఉంటే ఉప ఎన్నికల్లో పోటీ చేసి మళ్లీ గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. పార్టీ మారిన ఎమ్మెల్యే తన పదవికి రాజీనామా చేసి, దమ్ముంటే ఉప ఎన్నికల్లో పోటీ చేసి తిరిగి గెలవాలన్నారు.

పరిశోధనలు, ఆవిష్కరణలు అభివృద్ధిలో కీలకం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న తేజ్‌లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: పరిశోధనలు, ఆవిష్కరణలు అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తాయని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ తేజ్‌లోహిత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ క్యాంపస్‌లో శుక్రవారం ఫ్లిప్‌కార్ట్ సహకారంతో 'ఈ కామర్స్'పై ప్రత్యేక వర్క్‌షాప్‌ను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమల సహకారంతో విద్యా నైపుణ్యాలను విద్యార్థులకు కలిగించేలా చేయాలనే తపనతో ఎఫ్‌డీడీఐ పనిచేస్తోందన్నారు. భారతదేశంలో డిజిటల్ వాణిజ్యం యొక్క ధోరణి, శిక్షణ, ప్రజాస్వామ్యీకరణ లక్ష్యంగా ఈ కామర్స్‌పై దృష్టి సారించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఫ్లిప్‌కార్ట్ పబ్లిక్ పాలసీ హెడ్ డాక్టర్ తఫీమ్‌సిద్దిఖీ మాట్లాడుతూ ప్రస్తుత రిటైల్ మార్కెట్‌లో ఇది 7.8 శాతం వాటాను కలిగి ఉందన్నారు. డిజిటల్ మార్కెట్‌లో విజయం సాధించాలని కోరుకునే విద్యార్థులకు ఆయన ఆచరణాత్మక మార్గదర్శకత్వాన్ని ఆయన అందించారు. చేతివృత్తులవారు, స్థానిక వ్యవస్థాపకులకు మద్దతు ఇవ్వడానికి అంకితమైన కార్యక్రమం ఫ్లిప్‌కార్ట్ సమర్థ్ చొరవను విద్యార్థులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ–హైదరాబాద్ ఫ్యాకల్టీ, అధికారులు, ఫ్లిప్‌కార్ట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రమాదం మాటున చేపల వేట

ఈసీ నదిలో చేపలు పడుతున్న యువత

- ప్రమాదకరమని తెలిసీ ఈత కొడుతున్న వైనం
- హిమాయత్‌సాగర్ పరిసరాల్లో సర్వత్రా ఆందోళన


హిమాయత్‌సాగర్ జలాశయం వద్ద ప్రమాదకర స్థితిలో చేపలు పడుతున్న యువకులు

బండ్లగూడ: ఎడతెరపి లేకుండా భారీ వర్షాలు కురిశాయి. ఎగువ ప్రాంతాల నుంచి వరదనీరు పోటెత్తుతోంది. దీంతో ఈసీ నది పరీవాహక ప్రాంతాలైన బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి హిమాయత్‌సాగర్, కిస్మత్‌పూర్ తదితర ప్రాంతాల్లో యువత నీటిలో ఎంజాయ్ చేస్తోంది. కొందరు యువకులు చెరువులో ఈత కొడుతున్నారు. చేపల వేటనూ కొనసాగిస్తున్నారు. ప్రమాదాలకు ఎదురెళ్తూ కొందరు యువకులు చేస్తున్న సందడి పలువురిని ఆందోళనకు గురిచేస్తోంది.

గతంలో పలు మార్లు కనిపించిన మొసళ్లు...

కిస్మత్‌పూర్, అత్తాపూర్ ఈసీ పరీవాహక ప్రాంతాలలో చేపల కోసం ఏ విధంగా ప్రయత్నిస్తున్నారో అక్కడ ప్రమాదం పొంచి ఉందనే సంగతి మర్చిపోతున్నారు. ఆ ప్రాంతంలో మొసళ్లు సంచరిస్తున్నాయి. గతంలో చేపల కోసమని గాలం వేస్తే రెండు మొసళ్లు వచ్చి గాలానికి చిక్కుకున్నాయి. ఇలా చేపల కోసం ఎరను కట్టి మరుసటి రోజు వచ్చి చిక్కిన మొసళ్లను చూసి మత్స్యకారుడు అవాక్కయాడు. జంతు ప్రదర్శన శాల అధికారులకు సమాచారమిచ్చాడు. వలలో ఊపిరాడక చిక్కిన రెండు మొసళ్లు చనిపోయినట్లుగా వారు గుర్తించారు. గతంలో కూడా అత్తాపూర్ ఈసీ నదిలో ఓ మొసలి దర్శనమిచ్చింది. బండపై విశ్రాంతి తీసుకుంటున్న మొసలిని చూసి స్థానికులు హడలిపోయారు. ఇంకా పలు మొసళ్లు ఉన్నట్లుగా స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

గేట్లు ఎత్తివేత సమయంలో...


మొసళ్లు హిమాయత్‌సాగర్ గేట్లు ఎత్తివేత సమయంలో ఈసీ చేరువులోకి వచ్చి ఉంటాయని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నట్లు గతంలో తెలిపారు. చిన్న పిల్లలు నీటిలో వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలని కోరుతున్నారు. లేకుంటే మొసళ్లు పట్టుకునే ప్రమాదం ఉంది. మొసళ్లు తిరుగుతున్నాయని భావించేచోట జాగ్రత్తలు పాటించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

సూచిక బోర్డుల ఏర్పాటు అవసరం...

గతంలో కార్పొరేషన్ పరిధి ఈసీ పరీవాహక ప్రాంతాలలో అధికారులు ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు పాడైపోయాయి. ప్రస్తుతం అక్కడ సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి మొసళ్లు ఉన్నాయి జాగ్రత్త అనే సూచిక బోర్డులు ఏర్పాటు చేసి తగిన చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా చేపల వేట..

ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షలకు హిమాయత్‌సాగర్ క్రస్టు గేట్లును ఎత్తడంతో ఈసీ నదిలో కొత్త నీరుకు చేపలు ఎదురొస్తుండటంతో ఈసీ పరీవాహక ప్రాంతాల్లో మత్స్యకారులు, యువకులు ప్రమాదకర స్థాయిలో చేపల వేట సాగిస్తున్నారు. ఆయా ప్రాంతాలలో చేపలు పట్టకూడదని పోలీసులు ఆదేశాలు జారీ చేస్తున్నా పట్టించుకోవడం లేదు.


చెక్‌ద్యాం దగ్గర ఈత కొడుతున్న యువకులు

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు తాము ఉంటున్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని 22వ డివిజన్‌లో ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దోమల వల్ల కలిగే మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు నివారించేందుకు దోమల వృద్ధి చెదే ప్రదేశాలూన పూల కుండీలు, కులర్లు, కొబ్బరి బొండాలు, పాత టైర్లలో నిల్వ ఉన్న నీటి పారవేశారు. దీని వల్ల దోమల లార్వా దశ విచ్చిన్నమై దోమల ఎదుగుదల నిశిస్తుందన్నారు. ఈ కార్యక్రమాన్ని వారానికి ఒక సారి ప్రతి శుక్రవారం నిర్వమిస్తున్నామన్నారు. తద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, సూపర్‌వైజర్ అధికారులు, వార్డు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు


మాట్లాడుతున్న మునీశ్వరి

రాజేంద్రనగర్: సీపీఐ రాజేంద్రనగర్ మండల కార్యాలయం ఏఆర్ దేవరాజ్ భవన్‌లో శుక్రవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. భారత జాతీయ మహిళా సమాఖ్య రాజేంద్రనగర్ అధ్యక్షురాలు కె.మునీశ్వరి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి షైమిద మాట్లాడుతూ... తెలంగాణ సాయుధ పోరాటం సెప్టెంబర్ 11 నుంచి 17వ వరకు అన్ని మండలాలో నిర్వహించారన్నారు. 10 లక్షల ఎకరాల భూమిని పంచిన ఘన చరిత్ర, 3 వేల గ్రామాలను విముక్తి చేసిన సాయుధ పోరాట అమరవీరుల త్యాగ ఫలితాలు, 4500 మంది అమరులై తెలంగాణ పోరాట అమరుల రక్తంతో తడిసిన నేల అనేక మంది వీరవనితలు ఆరుట్ల కమలాదేవి లాంటి వాళ్లు ఎంతో మంది ఈ పోరాటంలో భాగస్వాములయ్యారన్నారు. వీరికి నిజమైన నివాళి వీళ్ల త్యాగాలను స్మరించుకుంటూ సెప్టెంబర్ 17 వరకు వాడవాడలా దీనిని సాయుధ పోరాటం గురించి ప్రచారం చేసి మన సంఘాలను బలోపేతం చేసుకునే విధంగా భవిష్యత్తు పోరాటాలు ఉండాలని పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ మండల కార్యదర్శి కన్యగారి లక్ష్మీ, బండారి శాంతమ్మ, కె.జ్యోతి, పి.బుజ్జి, ఆర్.వెంకటమ్మ, జి.విజయ తదితరులు పాల్గొన్నారు.

సాక్షిపై 'కూటమి' కక్ష సాధింపు చర్యలు సరికాదు


మనోజ్ పండ్ల

రాజేంద్రనగర్: సాక్షి మీడియాపై ఆంధ్రప్రదేశ్‌లో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం, సాక్షి ఎడిటర్‌పై కుట్రపూరితంగా కేసులు, సిబ్బందిపై దాడులు చేయడం నీచమైన, అప్రజాస్వామికమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మనోజ్ పండ్ల అన్నారు. ప్రజాస్వామ్యానికి పత్రికా స్వేచ్ఛ ముఖ్యం మాత్రమే కాదు.. అది ప్రజాస్వామ్యం అని గుర్తెరగాలన్నారు. మీ సొంత అభిప్రాయాలకు మాత్రమే మీరు అర్హులు కానీ... మీ సొంత వాస్తవాలకు కాదు అని... వాస్తవాలను మీడియా ద్వారా తెలియజేస్తే మీడియాపైన, జర్నలిస్టులపై దాడులు చేసి తప్పుడు కేసులు బనాయించి భయపెట్టడం సిగ్గుమాలిన పనులుగా భావిస్తున్నామన్నారు. అధికారులు జవాబుదారిగా ఉంచడానికి మన ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర అమోఘమన్నారు.

'విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేలా మేళా'


మేళాలో ఎంఈఓ శంకర్ తదితరులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల విద్యాధికారి కె.శంకర్ అధ్యక్షతన మండల స్థాయి పీఎస్ యుపీఎస్, పాఠశాలల టీఎల్ఎం–మేళాను నిర్వహించారు. విద్యార్థులకు టీఎల్ఎం ద్వారా సులభంగా అర్థమయ్యే రీతిలో ఏ విధంగా బోధన చేయాలో ఉపాధ్యాయులు వివరించారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎం.సుగుణ, శ్రీలత, బి.శ్రీను నాయక్, చంద్రశేఖర్ రెడ్డి, ఝాన్సీలతో పాటు రాజేంద్రనగర్ మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు. మండల స్థాయిలో గెలుపొందిన విద్యార్థులకు మండల కాంప్లెక్స్ స్థాయిలో ప్రథమ, ద్వితీయ బహుమతులను ఎంఈవో అందజేశారు.

స్ఫూర్తిప్రదాత సర్వేపల్లి రాధాకృష్ణన్



ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

అత్తాపూర్: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత మాట్లాడుతూ... ఒక ఉపాధ్యాయుడిగా తన ప్రయాణాన్ని ప్రారంభించిన సర్వేపల్లి అత్యున్నతమైన రాష్ట్రపతి స్థాయికి చేరుకోవడం చిరస్మరణీయం అన్నారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకొని క్రమ శిక్షణతో, ఇష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. తర్వాత జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన గణిత ఉపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయులు బృందం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రాజ్యబేగం, సాయిప్రసాద్‌రావు, సుజాత, రంగారెడ్డి, శ్రీనివాస్‌సాగర్ పాల్గొన్నారు.

15, 16వ తేదీల్లో డిగ్రీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 15, 16వ తేదీల్లో డిగ్రీ కోర్సుల్లో స్పాట్ అడ్మిషన్లు తీసుకోనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందు తెలిపారు. బీఏలో 2, బీకాం 7, బీఎస్సీ ఫిజికల్ సైన్స్‌లో 22, లైఫ్‌సైన్స్‌లో 24 సీట్లకు స్పాట్ అడ్మిషన్లు తీసుకోనున్నట్లు తెలిపారు. విద్యార్థులు పదవ తరగతి, ఇంటర్ మార్కుల ఒరిజనల్ ధ్రువపత్రాలతో టీసీ, బోనాఫైడ్, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఒరిజినల్‌తో పాటు జిరాక్స్ ప్రతులు, 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో కళాశాలలో నేరుగా సంప్రదించాలన్నారు. వివరాలకు ఫోన్: 70327 13785లో సంప్రదించాలన్నారు.

నార్సింగిలో సర్వీసు రోడ్ల మూసివేత


నార్సింగిలో మూసి వేసిన సర్వీసు రోడ్డు వద్ద వాహనాలను అడ్డుకుంటున్న పోలీసులు

మణికొండ: ఉస్మాన్‌సాగర్ (గండిపేట) జలాశయం నుంచి నీటి విడుదల అధికం కావటంతో నార్సింగిలో ఔటర్ రింగ్ రోడ్డు పక్కన ఉన్న సర్వీసు రోడ్లను మూసివేశారు. గండిపేట జలాలయం పరివాహకంలో గురువారం నుంచి భారీ వర్షాలు కురవటంతో అదే స్థాయిలో వరద వచ్చింది. దాంతో శుక్రవారం ఉదయం నుంచి గేట్ల సంఖ్య, నీటి విడుదల సామర్థ్యాన్ని పెంచారు. సాయంత్రం 7 గంటలకు ఆరు గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తటంతో మూసీ నదిలో నీటి ప్రవాహం పెరిగింది. నార్సింగిలో నీటి ప్రవాహం సర్వీసు రోడ్ల పై నుంచి రావటంతో నార్సింగి నుంచి పోలీస్ అకాడమీకి వెల్లే దారితో పాటు అటు నుంచి ఇటు వచ్చే సర్వీసు రోడ్లను మూసి వేశారు. వాటితో పాటు ఔటర్ 18ఎ ఎగ్జిట్‌ను సైతం మూసివేశారు. నీటి ప్రవాహాన్ని బట్టి తెరిచే విషయాన్ని ప్రకటిస్తామని, అప్పటి వరకు ఇటు వైపు వాహనాలు రావద్దని నార్సింగి పోలీసులు, జలమండలి అధికారులు తెలిపారు.

సత్యనారాయణ సేవలు చిరస్మరణీయం


నివాళులర్పిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్: నిరుపేదల పక్షాన నిలిచి వారి హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేసిన మాజీ రాజేంద్రనగర్ కౌన్సిలర్ నారామోని సత్యనారాయణ చిరస్మరణీయుడని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకుడు వర్రీ లలిత్ నంద వెల్లడించారు. రాజేంద్రనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్ ఆధ్వర్యంలో శుక్రవారం రాజేంద్రనగర్ ఎన్‌ఐఆర్‌డీ చౌరస్తాలో నిర్వహించిన సత్యనారాయణ 19వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం లలిత్ మాట్లాడుతూ... ప్రజలు తమ సమస్యలను వివరించేందుకు సత్యనారాయణ వద్దకు వస్తే వారి సమస్యపై నినాదంగా విని పరిష్కరించేవారని తెలిపారు. దీంతో ప్రజలంతా ఆయనను ముద్దుగా మూన్‌లైట్ సత్తెన్న అని పిలిచేవారని గుర్తు చేశారు.



కాళోజీ చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు

కాళోజీకి ఘనంగా నివాళి

అత్తాపూర్: అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాళోజీ నారాయణరావు జయంతి కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా తెలుగు భాషా దినోత్సవంగా ప్రకటించిందని అన్నారు. కర్ణాటకలోని బీజాపూర్ ప్రాంతంలో జన్మించిన కాళోజీ తెలుగు భాషకు చేసిన సేవలు చిరస్మరణీయమని, తెలంగాణ రాష్ట్ర సిద్ధించడానికి తాను రాసిన నా గొడవ కూడా ఒక భాగం అని అన్నారు. కార్యక్రమంలో తెలుగు భాష ఉపాధ్యాయులు శ్రీనివాస్‌సాగర్, లింగరాజు, కవిత, ఉపాధ్యాయులు రజియాబేగం, సాయిప్రసాదరావు, పీడీ రంగారెడ్డి, సుజాత, రోజారాణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

మాదాపూర్: మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన అంతర్జాతీయ ఇంజనీరింగ్ సదస్సు శుక్రవారం ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత్‌ను ఇన్నోవేషన్ అధారిత ఆర్థిక వ్యవస్థగా మలచడంలో ఇంజనీరింగ్ పరిశోధన అకాడమియా ఇండస్ట్రీ తోడ్పడుతుందన్నారు. భారతీయ ఇంజనీర్లు ప్రపంచ స్థాయి నిపుణులతో ఆలోచనలు పంచుకోవడానికి వేదిక ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ సమాచార సాంకేతిక, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్‌కుమార్, స్కైరూట్ ఏరోస్పేస్ సహ వ్యవస్థాపకుడు పవన్‌కుమార్ చందన, ఎఎస్ఎంఈ ఇండియా డైరెక్టర్ మధుకర్‌శర్మ, ఎఎస్ఎంఈ అధ్యక్షుడు డాక్టర్ లెస్టర్ సూ తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక మహిళ అదృశ్యం


ఐశ్వర్య

అత్తాపూర్: వేధింపులు భరించలేక ఓ వివాహిత ఇంటి నుంచి వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ పార్వతియాదవ్ సమాచారం మేరకు... అత్తాపూర్ ప్రాంతానికి చెందిన మనోజ్, ఐశ్వర్య భార్యాభర్తలు. కొంత కాలంగా వేధింపులు ఎక్కువగా అయ్యాయని తాను ఇంట్లో నుంచి వెళ్లిపోతున్నట్లు ఇంటి సమీపంలో ఉన్న మకొకరికి చెప్పి ఐశ్వర్య ఆటోలో వెళ్లిపోయింది. స్నేహితులు, బంధువల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించకపోవడంతో మనోజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

మణికొండ: వీఆర్4 సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్, శ్రీధర్ క్లినిక్ ఆధ్వర్యంలో మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు డాక్టర్ ప్రభావతి తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు. ఈఎన్‌టీ, డెంటల్, జనరల్, ఎముకలు తదితర వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేస్తామన్నారు. మణికొండ మున్సిపాలిటీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.


రామంజాపూర్‌లోని రేకులకుంట అలుగునీటికి అడ్డుగా నిర్మించిన ప్రహరీ


రామంజాపూర్‌తండా రోడ్డుపై నిలిచిన కుంటనీరు

అలుగు కాలువకు అడ్డుగా నిర్మాణం

- కుంట నీరు బయటకు వెళ్లేందుకు అడ్డంకులు
- తండా రోడ్డుపై నిలిచిన నీరు

శంషాబాద్ రూరల్: చెరువు అలుగు కాలువకు అడ్డుగా ప్రహరీ నిర్మాణంతో వరదనీరు రోడ్డుపైకి చేరుతోంది. దీని కారణంగా రోడ్డుపై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని రామంజాపూర్ శివారులో ఉన్న రేకుల కుంట వరదనీటితో నిండిపోయింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చాలా ఏళ్ల తర్వాత అలుగు పారుతోంది. అయితే అలుగు కాలువ వద్ద రియల్టర్లు ప్రహరీ నిర్మాణం చేశారు. దీంతో అలుగు నుంచి వరదనీరు బయటకు వెళ్లేందుకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. రేకుల కుంట పక్కనే రామంజాపూర్‌తండా రోడ్డు ఉండగా.. కుంటలోని నీరు రోడ్డుపైకి చేరుతోంది. దీంతో తండాకు రాకపోకలు సాగించేందుకు స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలుగునీరు సజావుగా వెళ్లేగా చర్యలు తీసుకోవాలని తండావాసులు డిమాండ్ చేస్తున్నారు.